నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 15 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బక్రీద్ తోఫాల పంపిణీ

మంచిర్యాల టౌన్, జూన్ 14 : బక్రీద్ పండుగను పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు పేద ముస్లింలకు తోఫాలు అందించారు. తన తండ్రి కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్టు ద్వారా ముస్లిం మహిళలకు కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, కౌన్సిలర్లు, కాంగ్రెస్ జిల్లా నేతలు పాల్గొన్నారు.

నస్పూర్ మున్సిపాలిటీలో....

సీసీసీ నస్పూర్, జూన్ 14 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ బక్రీద్ తోఫాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పదేళ్ల నుంచి మంచిర్యాల నియోజకవర్గంలో కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుర్మిల్ల వేణు, పట్టణ పార్టీ అధ్యక్షుడు బండారి సుధాకర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

డీఎంహెచ్‌వో డా.అనిత

రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాల ఏసీసీ, జూన్ 14 : ప్రతి ఒక్కరూ స్వచ్ఛందగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత కోరారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంచిర్యాల వైద్య, ఆరోగ్య శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ దవాఖానతో పాటు రామకృష్ణాపూర్, కాజీపేటలో బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 415 మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, సతీష్, మహేందర్ రెడ్డి, డాక్టర్ ప్రియాంక, వైద్యాధికారి నీలిమ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి
- ప్రసవాలపై అవగాహన కల్పించాలి
- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్,జూన్14 : వానకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖ, పంచాయతీ, మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులను అరికట్టాలని సూచించారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యాంటి బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నీరు నిల్వ ఉండే చోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. వారానికి రెండు రోజులు డ్రై డే పాటించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రతి రోజూ జ్వరాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రసూతి మరణాలపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి తుకారాంభట్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 19 ఏళ్లలోపు వారికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, జిల్లా విద్యాశాఖ లైజన్ అధికారి ఉదయ్ బాబు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, బీసీ సంక్షేమశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలి

జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులకు అవసరమైనన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మర్రి సురేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరితతో కలిసి సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని రూర్బన్ పథకంలో భాగంగా నిర్మించారని, ఇంకా కావాల్సిన సదుపాయాలపై ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన ప్రకృతి వనాలు

కేసీఆర్ సర్కారులో ఊరికొకటి చొప్పున ఏర్పాటు

- ప్రభుత్వం మారడంతో పట్టింపు కరువు
- మోడువారి.. ఎడారిని తలపిస్తున్న వనాలు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ సర్కారు.. ఊరూరా ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి పరిరక్షించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పట్టింపులేని తనంతో అవి ఆనవాళ్లు కోల్పోయి అధ్వానంగా మారాయి. మొక్కలు, చెట్లన్నీ ఎండిపోయి ఎడారులను తలపిస్తున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువవ్వడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎండిపోయిన మొక్కలతో కళావిహీనంగా మారిన కెరమెరి(హట్టి) పల్లె ప్రకృతి వనం

గ్రామానికొకటి చొప్పున..

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలుండగా, గత ప్రభుత్వం గ్రామానికొకటి చొప్పున పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసేంది. గ్రామాల్లో అందుబాటులో ఉన్న స్థలాలను బట్టి ఎకరం నుంచి మూడెకరాల పరిధిలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు చల్లని వాతావరణం కోసం మొక్కలు నాటింది. చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో పాటు ప్లాట్‌ఫాంలు నిర్మించారు. వాకింగ్ ట్రాక్‌ల పక్కన వేప, మర్రి, కానుగ, బాదం, దానిమ్మ, సీతాఫలం, నేరేడు తదితర పండ్లు, పూల మొక్కలు పెంచారు. చిన్నారులు ఆడుకోవడానికి పరికరాలు సైతం ఏర్పాటు చేశారు. స్థలాల్లో సహజంగా ఉన్న గుట్టలు, బండలపై జంతువులు, ఇతర అందమైన బొమ్మలు వేశారు. కానీ, ప్రభుత్వం మారడంతో అధికారులు పల్లె ప్రకృతి వనాలను పట్టించుకోవడం మానేశారు. గ్రామాలకు ప్రత్యేకంగా ట్రాక్టర్లు ఉన్నప్పటికీ పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలకు నీళ్లు పోయడం లేదు. దీంతో నాడు పచ్చగా కళకళలాడిని పల్లె ప్రకృతి వనాలు.. నేడు వెలవెల బోతున్నాయి.

హరితహారానికి ప్రాధాన్యమివ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

'తెలంగాణ పచ్చబడాలే.. చెట్లు లేక బోసిపోయిన పల్లెలు, పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరియాలే.. పరాయి పాలనలో నిర్జీవంగా మారిన అడవులకు పునరుజ్జీవం పోయాలే.. పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలపాలే..' అనే సదుద్దేశంతో కేసీఆర్ సర్కారు హరితహారం కార్యక్రమం చేపట్టి కోట్లాది మొక్కలకు ప్రాణం పోసింది. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకంగా స్థలాలు కేటాయించి నర్సరీలు ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామంలో యేటా 40 వేల మొక్కలు నాటింది. వర్షాకాలం ప్రారంభంలోనే హరితహారం పండుగలా సాగేది. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హరితహారం కార్యక్రమం కనుమరుగవుతోంది. హరితహారం నర్సరీల నిర్వహణను ప్రభుత్వంతో పాటు అధికారులు గాలికి వదిలేసినట్లుగా కనిపిస్తోంది. సర్పంచులు లేకపోవడం.. గ్రామ పంచాయతీల పాలన ప్రత్యేకాధికారులకు అప్పగించడంతో నర్సరీల నిర్వహణ చూసేవారే లేకుండా పోయారు. నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు నియమించిన సిబ్బంది కూడా పట్టించుకోకపోవడం గమనార్హం.

తిర్యాణి మండలం మొకాసి గూడలో..

తిర్యాణి మండలం ఇస్రుగూడ పల్లె ప్రకృతి వనం దుస్థితి ఇదీ

రోంపల్లి పల్లె ప్రకృతి వనంలో ఎండిన మొక్కలు


మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఏసీపీ ఆర్.ప్రకాశ్

దండం పెడుతం.. న్యాయం చేయండి

- ప్రహరీ కూలి మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల ధర్నా
- మంచిర్యాల ఐబీ చౌరస్తాలో కార్మిక సంఘాలతో కలిసి రెండు గంటలపాటు బైఠాయింపు
- పోలీసులు, ఎమ్మెల్యేల జోక్యంతో ఆందోళన విరమణ
- పోస్టుమార్టం అనంతరం మృతదేహాల అప్పగింత

మంచిర్యాల ఏసీసీ, మే 14 : 'కూలీ పనులు చేసుకొని బతికేటోళ్లం.. బుక్కెడు బువ్వ పెట్టేటోళ్లను పోగొట్టుకున్నం.. మీకు దండం పెడుతం.. న్యాయం చేయండి' అంటూ గురువారం ప్రహరీ కూలీ మృతి చెందిన గోశెం పోశం, హన్మంతు, ఆత్రం శంకర్ కుటుంబాల సభ్యులు ధర్నాకు దిగారు. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన సమీపంలోని ఐబీ చౌరస్తాలో బంధువులు, కార్మిక సంఘాల నాయకులు బైఠాయించారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల దాకా ఆందోళన కొనసాగింది. ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సీలాల్, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకొని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. మంచిర్యాల ఎమెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అక్కడికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. చివరకు ఎమ్మెల్యేలు, పోలీసులు జోక్యంతో ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.6.50 లక్షల చొప్పున ఇచ్చేందుకు, గాయపడ్డ మైదం రాములు కుటుంబానికి రూ.2 లక్షలు అందించేందుకు భవనం యజమాని ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

ఆయా కుటుంబాల్లో విషాదం

ప్రహరీ కూలి చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన గోశెం పోషం, రుద్రాపూర్‌కు చెందిన హన్మంతు, బాబాపూర్‌కు చెందిన ఆత్రం శంకర్ మృతి చెందగా, ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాలను గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పోస్టుమార్టం కోసం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆయా సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. బంధువుల రోదనలు అక్కడున్న వారిని కలచివేశాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్ రావు

న్యాయం చేయాలని మొక్కుతున్న వ్యక్తి

టార్గెట్‌ను కచ్చితంగా పూర్తి చేయాలి

మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్

జన్నారం, జూన్ 14 : మిషన్ భగీరథ ఇంటింటి సర్వేలో రోజూవారి టార్గెట్‌ను కచ్చితంగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కిష్టాపూర్, రేండ్లగూడ, ధర్మారం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో కచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సింగిడి రమేశ్, కార్యదర్శులు గోపిచంద్ నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిల్లలకు అక్షరాభ్యాసం..

ధర్మారంలోని యూపీఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ శుక్రవారం అక్షరాభ్యాసం చేయించారు. అంతకుముందు కిష్టాపూర్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మేధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పాఠశాల పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించాలన్నారు. ఎంఈవో నడిమెట్ల విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న, తుంగూరి గోపాల్, సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దముక కమలాకర్, ప్రకాశ్ పాల్గొన్నారు.

ధర్మారం యూపీఎస్‌లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్

భగీరథ సర్వే పక్కాగా చేయాలి

లక్షెట్టిపేట, జూన్ 14 : ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ సర్వేను పక్కాగా చేయాలని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు కార్యదర్శి సెక్రటరీలను ఆదేశించారు. మండలంలోని లక్ష్మీపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న భగీరథ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ తిరుగుతూ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా.., నీటి సరఫరా సక్రమంగా ఉందా.. అని తెలుసుకొని, ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. ఇప్పటివరకు చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీవో వెంట ఎంపీడీవో సరోజ, ఎంపీవో ప్రసాద్, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.


లక్షెట్టిపేట : తిమ్మాపూర్‌లో సర్వే వివరాలు తెలుసుకుంటున్న డీపీవో

తాండూర్‌లో ఎంపీడీవో పరిశీలన..

తాండూర్, జూన్ 14 : మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వేను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. సర్వే పకడ్బందీగా నిర్వహించి, వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటా తిరిగి, మిషన్ భగీరథ కనెక్షన్ల సంఖ్య, నీటి సరఫరా, కుటుంబ సభ్యుల వివరాలను సర్వే చేసి యాప్ ద్వారా నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట కార్యదర్శి తపాస్‌కుమార్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

కెరమెరిలో..

కెరమెరి, జూన్ 14: గ్రామాల్లోని మిషన్ భగీరథ నీటి సర్వేలు ఇంటింటికీ తిరిగి పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో మహ్మద్ అమ్జద్‌పాషా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్‌తో కలిసి మిషన్ భగీరథ పథకం పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈసీ ఆఖ్యానాయక్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పూటలా తాగునీరందిస్తాం

- వచ్చే మార్చికల్లా అన్ని ప్రాంతాలకు పైపులైన్లు
- మంచిర్యాల మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు
- పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం
- ఆలస్యం కావడంతో సంతకం పెట్టి వెళ్లిపోయిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలటౌన్, జూన్ 14 : మంచిర్యాల పట్టణ వాసులకు ప్రతి రోజూ రెండు పూటలా తాగునీరందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరుకాగా, చైర్మన్ ఉప్పలయ్య, కమిషనర్ మారుతీ ప్రసాద్ పూలబొకే అందించి, శాలువాతో సత్కరించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 12 గంటలు దాటినా మొదలుకాకపోవడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరుపట్టికలో సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. అనంతరం 12.15 గంటలకు సమావేశం ప్రారంభమైంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే యేడాది మార్చికల్లా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పైపులైన్లు వేస్తామన్నారు. అప్పటినుంచి అన్ని వార్డుల్లో రెండు పూటలా తాగునీరందిస్తామని చెప్పారు. అనంతరం ఎజెండాలో పొందు పరిచిన 21 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇబ్బందిగా మారిన విద్యుత్ స్తంభాలను మార్చేందుకు అవసరమైన రూ. 4.28 లక్షలను విద్యుత్ శాఖకు అందించడానికి కౌన్సిల్ ఆమోదించింది. 15వ ఫైనాన్స్ నిధులు రూ. 273.70 లక్షలతో తాగునీటి సరఫరాకు అవసరమున్న పైపులైన్లు, ఇతర అభివృద్ధి పనులు చేసేందుకు కౌన్సిల్ అంగీకారం తెలిపింది. మున్సిపల్ సాధారణ నిధులు రూ. 132.99 లక్షలు వెచ్చించి వివిధ వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం లభించింది. పట్టణంలో ఉన్న 292 సీసీ కెమెరాల నిర్వహణకు అవసరమైన రూ. 5.78 లక్షలు చెల్లించడానికి కౌన్సిల్ ఒప్పుకుంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, రంజాన్ పండుగ సందర్భంగా చేపట్టిన పనులకు ఖర్చయిన మొత్తాన్ని చెల్లించేందుకు కౌన్సిల్ అంగీకరించింది. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్ మారుతీ ప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, ఎంఈ మధూకర్, ఏఈ రాజేందర్, ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679